క్లుప్తంగా

అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

పిడుగురాళ్ల: జూన్ 2వ తేదీన అరుణాచలం గిరి ప్రదక్షణానికి పిడుగురాళ్ల ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ ముక్తేశ్వరరావు తెలియజేశారు. అరుణాచలం గిరి ప్రదక్షణ ఎంతో విశిష్టమైనదని భక్తుల నమ్మకం జూన్ 4వ తేదీ పౌర్ణమిని పురస్కరించుకుని 2వ తేదీ రాత్రి 9 గంటలకు పిడుగురాళ్ల డిపో నుంచి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ బస్సు 2వ తేదీ రాత్రి బయలుదేరి కాణిపాకం, శ్రీ కాళహస్తి, గోల్డెన్‌టెంపుల్ మీదగా అరుణాచలం చేరుకుంటుందన్నారు. అక్కడ నుంచి బయలుదేరి జూన్ 5వ తేదీన పిడుగురాళ్లకు చేరుకుంటుందన్నారు. ఆసక్తిగల భక్తులు పిడుగురాళ్ల డిపో మేనేజర్‌ను సంప్రదించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు : 9849556384, 9959225430 నంబర్లను సంప్రదించాలన్నారు.

రైతు భరోసాకేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

రాజుపాలెం: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు పచ్చిరొట్ట ఎరువులైన పిల్లిపెసర, జీలగలు ఇస్తున్నట్లు ఏఓ వెంకటవీరయ్య శనివారం తెలిపారు. కావాల్సిన రైతులు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, ఫోన్ తీసుకుని వెళ్లితే పచ్చిరొట్టి విత్తనాలు ఇస్తారని తెలిపారు.

ఘనంగా పోలేరమ్మ కొలుపులు

లంకెలకూరపాడు(ముప్పాళ్ళ): మండలంలోని లంకెలకూరపాడు గ్రామంలో పోలేరమ్మతల్లి కొలుపులు ఘనంగా జరుగుతున్నాయి. మూడవరోజు అమ్మవారికి వసంతోత్సవం నిర్వహించారు. సాయంత్రం కుంకుమబండి ఊరేగింపు కార్యక్రమం జరిగింది. కొలుపుల్లో సత్తెనపల్లి మాజీ శాసనసభ్యుడు యర్రంవెంకటేశ్వరరెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న గ్రామస్తులంతా గ్రామానికి చేరి పెద్ద ఎత్తున కొలుపుల కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

పీబీసీ కాల్వ వద్ద తప్పిన ముప్పు

ముప్పాళ్ళ: మండలంలోని లంకెలకూరపాడు వెళ్ళే రహదారి మలుపు వద్ద లారీ లోని సుబాబుల్‌లోడ్‌తో వెళుతున్న మొద్దులు జారి రోడ్డుపై పడ్డాయి. ఈ ఘటనలో ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. లంకెలకూరపాడు గ్రామం నుంచి సుబాబుల్‌లోడ్‌తో వస్తున్న లారీ సత్తెన పల్లి-నరసరావుపేట ప్రధానరహదారి ఎక్కే క్రమంలో కట్టిన తాళ్ళు తెగి అందులోని మొద్దులు జారాయి. గమనించిన స్థానికులు కేకలు వేయడంతో లారీని నిలిపివేశారు. కూలీల సాయంతో మొద్దులు తొలగించి మరలా రాకపోకలు పునరుద్ధరించారు.

కెనడాలో తెలుగు విద్యార్థి అదృశ్యం పై వివరాల సేకరణ

సత్తెనపల్లి: కెనడాలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తెలుగు విద్యార్థి అదృశ్యమైన విషయం తెలిసిందే. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం పెద్దమక్కెన గ్రామాన్ని గ్రామస్థాయి రెవెన్యూ అధికారులు శనివారం సందర్శించి అదృశ్యమైన నిడమానూరు శ్రీధర్ తల్లిదండ్రులైన సీతారామయ్య, వెంకటరమణ నుంచి వివరాలు సేకరించారు. గత నెల ఏప్రిల్ 6న పెద్దమక్కెన నుంచి కెనడా బయలుదేరి వెళ్లాడని, ఉదయం, సాయంత్రం తమతో మాట్లాడేవాడని తల్లిదండ్రులు చెప్పారు. గత నెల 21న కంపెనీ ఉద్యోగులు ఫోన్ చేసి శ్రీధర్ రెండు రోజుల నుంచి డ్యూటీకి రావడం లేదని చెప్పారని, ఆ తరువాత కూడా శ్రీధర్ సమాచారం లభించలేదన్నారు. తమ బిడ్డ ఆచూకీ కనుగొనాలని రాష్ట్ర జలవ నరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులును కోరగా రాయభారం కూడా పంపారని, అయినప్పటికీ ఎలాంటి సమాచారం రాలేదని చెప్పారు.

మద్యం బాటిళ్లు ధ్వంసం

పెదకూరపాడు: బెల్లంకొండ మండలంలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను ఎస్ఈబీ సిబ్బంది, స్థానిక పోలీసులు ధ్వంసం చేశారు. అసిస్టెంట్‌ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్, ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ కొండారెడ్డి, బెల్లంకొండ ఎస్సై అమిర్‌సా తెలిపిన వివరాల మేరకు అక్రమంగా మద్యం తరలిస్తూ 46 కేసుల్లో సీజ్ చేసిన సుమారు రూ. 11.8 లక్షల విలువ చేసే 7,915 మద్యం క్వాటర్ బాటిళ్లు, ఏపి ప్రొహిబిషన్ యాక్ట్‌కు సంబంధించి 24 కేసుల్లో సీజ్ చేయబడిన సుమారు రూ.1,22,560ల విలువ చేసే నాటుసారాను జేసీబీ సహాయంతో ధ్వంసం చేసినట్లు వెల్లడించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి


ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని వివరిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

కారెంపూడి: ఇది ముమ్మాటికి ప్రజా ప్రభుత్వమని ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ప్రభుత్వం చేస్తున్న మేలును గుర్తించి ప్రభుత్వానికి మద్దతు తెలపాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మూడవ రోజు శనివారం కారెంపూడిలో ఎమ్మెల్యే పీఆర్కే కొనసాగించారు. దాచేపల్లి రోడ్డు, మేడ బజారుతో పాటు ఒకటవ వార్డులో ఒక బజారులో ఇంటింటికి వెళ్లి గడచిన నాలుగేళ్ల కాలంలో ప్రతి కుటుంబానికి వివిధ పథకాల ద్వారా ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని వారికి వివరించి సంక్షేమ కరదీపికలను వారికి అందించారు. తమ ఇళ్లకు వచ్చిన ఎమ్మెల్యే పీఆర్కేకు ప్రజలు సాదర స్వాగతం పలికారు. తమకున్న సమస్యలను నేరుగా పీఆర్కేకు చెప్పుకున్నారు. ఆ సమస్యలు వెంటనే పరిష్కారం అయ్యేలా అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. చాలా మంది తమకు నివేశన స్థలం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పింఛన్లు ఇంటి వద్దకే వచ్చి అందిస్తుండడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. అమ్మ ఒడి, ఫీజు రియింబర్స్ మెంట్, జగనన్న విద్యా వసతి దీవెనల వల్ల పిల్లల చదువులు సాఫీగా సాగుతున్నాయని ప్రజలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడం బాగుందని ప్రజలు పీఆర్కే ఎదుట సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఏడాది ధాన్యంతో పాటు మిర్చి, ఇతర పంటల ధరలు కూడా బాగున్నాయని రైతులు హర్షం వ్యక్తం చేశారు. నివేశన స్థలాలు పొందిన లబ్ధిదారులు అయ్యా పదేళ్లుగా నివేశన స్థలం కోసం ఎదురు చూశామని ఇప్పుడు ఆ కల నెరవేరిందన్నారు. కారెంపూడిలో 982 మందికి నివేశన స్థలాలిచ్చామని ఇంకా పెండింగ్‌లో ఉన్న వారికి కూడా ఇస్తామని అందరికి కూడా ఇళ్లు కూడా కట్టించి ఇచ్చే బాధ్యతను ప్రభుత్వం తీసుకుందని ఎమ్మెల్యే పీఆర్కే వివరించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలను వర్తింపచేయాలనేదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజా సేవలో మీ గడపల వద్దకు నిత్యం వలంటీర్లను, సచివాలయ ఉద్యోగులను పంపి మీకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమస్యలను పరిష్కరిస్తున్నామని, మంచి చేస్తున్నాము మెరుగైన పాలన అందిస్తున్నాము గుర్తుపెట్టుకుని మద్దతు నిలవాలని ఎమ్మెల్యే పీఆర్కే ప్రజలను కోరారు. గ్రామ సర్పంచ్ రమావతు ప్రమీలాభాయితేజానాయక్, జెడ్పీటీసీ షేక్ షఫీ, ఎంపీపీ మేకల శారదా శ్రీనివాసరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ అక్బర్, మండల, పట్టణ పార్టీ అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, బొమ్మిన అల్లయ్య, సచివాలయాల మండల కన్వీనర్ అల్లు వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీలు బొమ్మిన సావిత్రి, అంతరగడ్డ ఏసోబు, వార్డు మెంబర్లు కిల్లా రత్నకుమారి, కోరె సత్యం, రామిశెట్టి శకుంతల, నాయకులు కిల్లా కాశీవిశ్వనాథ్, పాతూరి రామిరెడ్డి, పలిశెట్టి కోటేశ్వరరావు, బొమ్మిన వీరబ్రహ్మం, బొమ్మిన హనుమయ్య, కరాలపాటి సుబ్బారావు, చీతిరాల కోటేశ్వరరావు, గుండా శ్రీనివాసరావు, గుండా నరసింహారావు, కొత్తా బ్రహ్మేశ్వరరావు, సూరె సుబ్రమణ్యం, చల్లా ప్రసాద్, జక్కా నరసింహారావు, చింతల శ్రీనివాసరావు, పలిశెట్టి ఆంజనేయులు, పలిశెట్టి వెంకటేశ్వర్లు, అన్నపరెడ్డి రాము, మద్రి శేషయ్య, జొన్నలగడ్డ శ్రీను, కాలె శివ, నూకాబత్తిన సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించే సౌకర్యం

పిడుగురాళ్ల: మాచర్ల డివిజన్ పరిధిలో గల మాచర్ల, గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్లలో ఈఆర్ఓ ఆఫీస్‌ల వద్ద బిల్లులు చెల్లించుటకు అన్ని కౌంటర్లు తెరిచినట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె.హరిబాబు తెలియజేశారు. ఆదివారం అయినప్పటికి విద్యుత్ బిల్లులు కట్టించుకోవడం జరుగుతుందని దీనిని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలియజేశారు.

సమస్యలు మా దృష్టికి తీసుకురండి

సీనియర్ సివిల్ జడ్జి బిఎల్ వెంకట శేషాద్రి

గురజాల : సబ్‌జైలులో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సీనియర్ సివిల్ జడ్జి బిఎల్ వెంకట శేషాద్రి , జూనియర్ సివిల్ జడ్జి షర్మిలా సూచించారు. స్థానిక సబ్‌జైలును శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడుతూ సరైన సమయంలో భోజనం వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఎవరికైనా న్యాయవాదిని పెట్టుకోలేని స్థోమత ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటుచేసే అవకాశం ఉందన్నారు. వంటగదిని, ఆహారాన్ని పరిశీలించారు. స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో న్యాయవాది కలివెల ప్రభుదాస్, బార్ అధ్యక్షుడు షేక్ జానీబాష, సబ్‌జైల్ సూపరింటెండెంట్ సీహెచ్ సుబ్బారెడ్డి, ఆదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ నిర్మించి, ఉద్యోగ, ఉపాధి కల్పనకు కృషి చేయండి

చెన్నాయపాలెం, వేమవరం, తంగెడ గ్రామ ప్రజల విజ్ఞప్తి


కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ శ్యాం ప్రసాద్

మాచవరం: సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మించి భూములు ఇచ్చిన ప్రజలకు ఉద్యోగ, ఉపాధి, మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని చెన్నాయపాలెం, వేమవరం , తంగెడ గ్రామాల ప్రజలు అధికారులకు, సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. మండలంలోని చెన్నాయపాలెం, వేమవరం గ్రామాల మధ్య సరస్వతీ సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం పర్యావరణ పరిరక్షణలో భాగంగా పరిసర గ్రామాల ప్రజలతో ప్రజాభిప్రాయ సేకరణకు పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ అధ్యక్షతన శనివారం ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన పలువురు మాట్లాడుతూ పల్నాడులో వెనుకబడిన ప్రాంతమైన మాచవరం మండలంలో పరిశ్రమల నిర్మాణాల వల్ల పారిశ్రామికంగా ఎదిగి అనేక మందికి ఉద్యోగ, ఉపాధి కల్పనతో అభివృద్ధి జరుగుతుందన్న ఆశతో పంట భూములను ఫ్యాక్టరీ నిర్మాణం కోసం ఇచ్చామని, 15 ఏళ్ల గడుస్తున్నా ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టక పోవడంతో రైతులు, కూలీలు ఉపాధి కోల్పోయామని, ఇప్పటికైనా సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టి ప్రజలను ఆదుకోవాలని పలువురు అభిప్రాయాలను వెల్లడించారు. నాడు యాజమాన్యం ఇచ్చిన మాట ప్రకారం గ్రామాల్లో మంచినీటి వసతులు, అంతర్గత రోడ్లు, స్కూల్ భవనాలు, ఆరోగ్య భవనాలు, దేవాలయాలు నిర్మించాలని కోరారు. సాగు భూములన్ని బీడు భూములుగా మారడంతో ఇప్పటికే అనేక మంది వలస కూలీలుగా మారి ఇతర ప్రాంతాలకు తరలి వెళ్తున్నారని, నిర్మాణం చేపట్టే వరకు భూ యజమానులు భూములను సాగు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. నాడు భూములు కొనుగోలు సమయంలో మూడేళ్ల లోపు మార్కెట్ ధర పెరిగితే ఇంత మొత్తం చెల్లిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చారని, విజయాన్ని పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని విన్నవించారు. పలువురు పర్యావరణ పరిరక్షణ సామాజిక కార్యకర్తలు మాట్లాడుతూ ఫ్యాక్టరీ నిర్మాణాల వలన కలిగే దుష్ఫలితాలను నేడు అందుబాటులో ఉన్న సాంకేతికను ఉపయోగించి, ప్రజలకు నష్టం వాటిల్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఫ్యాక్టరీ నిర్మాణం త్వరగా చేపట్టి విద్య, ఉద్యోగ, ఉపాధి, మౌళిక సదుపాయాల కల్పన చేపట్టాలని సూచించారు. ఇవే కాకుండా ఉన్న వనరులు వినియోగించుకొని ఇతర పరిశ్రమలను నిర్మించి ప్రజల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.

పర్యావరణ రహిత ప్రాజెక్టు ఏర్పాటు చేస్తాం, సీజే రెడ్డి

ప్రజామోదం మేరకు నిర్ణీత ప్రాంతంలో పర్యావరణ రహిత పరిశ్రమల నిర్మాణం చేపడతామని సరస్వతీ సిమెంట్ ఫ్యాక్టరీ డైరెక్టర్ సీజె రెడ్డి తెలిపారు. చట్ట ప్రకారం స్థానికులకు ఉద్యోగ కల్పనలో 70 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల అభిప్రాయాలను, విన్నపాలను కమిటీ చర్చించి తగు న్యాయం చేస్తామన్నారు. త్వరలోనే అన్ని అనుమతులు పొంది ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ ఫ్యాక్టరీ నిర్మాణం పట్ల 99 శాతం మంది ప్రజలు ఆమోదం తెలిపారని, ప్రజా వేదికలో తెలియపర్చిన ప్రతి అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. జిల్లా ఎస్పీ రవి శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డీఆర్వో వినాయకం, ఆర్‌డీఓ అద్దెయ్య, తహసీల్దారు ప్రసాద్, జడ్పీటీసీలు ప్రకాష్‌రెడ్డి, శివాయాదవ్, పలువురు ప్రజా ప్రతినిధులు, ఆయా గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు సదుపాయాలు కల్పించాలి


ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న సీఐటీయూ మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు

పిడుగురాళ్ల: ఉపాధి హామీ కూలీలకు సదుపాయాలు కల్పించాలని సీఐటీయూవ మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని జానపాడు గ్రామంలో ఉపాధి హామీ పనులను సీఐటీయూ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 29న ఉపాధి హామీ కూలీల సదుపాయాలు కల్పించాలని, వారి సమస్యలను పరిష్కరించాలని కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని దీనికి పెద్ద సంఖ్యలో ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నాలని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఊలీలు గాయిత్రి, సుధా, నాగమణి, జోన్నలగడ్డ లక్ష్మయ్య, నాగరాజు, రామారావు, షేక్ అబ్దుల్లా, అల్లాని నీలమ్మ, హుస్సేన్ అమ్మ తదితరులు ఉన్నారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ

పిడుగురాళ్ల: మండే ఎండలకు చల్లటి మజ్జిగ ఎంతో అవసరమని వాసవి సత్ర సమయుదాయం సలహా కమిటీ మెంబర్ కోడూరి ప్రసాద్ అన్నారు. పట్టణంలోని భగవాన్ శ్రీ సత్యసాయి మందరం వారి ఆధ్వర్యంలో గ్లోబల్ సి ఫుడ్ అలయన్స్, కొనకొండ్ల కోటేశ్వరరావు సహకారంతో శనివారం మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రజలు ఇంటి నుంచి బయటకు రాకూడదని, వచ్చినా మజ్జిగ, మంచినీటి చలివేంద్రాల వద్ద వాటిని సేవించాలని ఆయన సూచించారు. లేకపోతే ఎండలకు ప్రజలు డీ హైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉందని దీనిని దృష్టిలో ఉంచుకుని మంచినీటిని, మజ్జిగను తప్పనిసరిగా తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సాయి వృద్ధాశ్రమం చైర్మన్ ఆత్మకూరి నరసింహమూర్తి, నకరికల్లు యూనియన్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వరరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు పసుపులేటి ఆనంద్‌బాబు, నేలటూరి బాలస్వామి, సత్యసాయిబాబా మందిర సభ్యులు పాల్గొన్నారు.

అనుమతులు లేని విత్తనాలు విక్రయిస్తే చర్యలు

ఏఓ బోయపాటి బ్రహ్మారెడ్డి


విత్తన విక్రయ కేంద్రంలో తనిఖీలు చేస్తున్న మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని విత్తన విక్రయ కేంద్రాల్లో అనుమతులు లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ బోయపాటి బ్రహ్మారెడ్డి హెచ్చరించారు. శనివారం విత్తనాల షాపుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి క్రయ, విక్రయాలకు సంబంధించిన రికార్డులను, వివిధ రకాల కంపెనీలకు చెందిన విత్తనాల ప్యాకెట్లను పరిశీలించి మాట్లాడారు. ఏపీలో లైసెన్స్ తీసుకోకుండా రైతులకు విత్తనాలను విక్రయించడం చట్టరిత్యా నేరమన్నారు. షాపు నిర్వహణకు సంబంధించి ప్రతి సంవత్సరం ప్రభుత్వ అనుమతి తప్పని సరిగా తీసుకోవాలన్నారు. విత్తనాల షాపు నిర్వాహకులు ఎవరైనా అనుమతులు లేని విత్తనాలు విక్రయిస్తే వారిపై విత్తన చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు అడిగిన విత్తనాలను మాత్రమే ఎంఆర్పీ ధరలకు ఇవ్వాలని సూచించారు. ధరల విషయంలో రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చినట్లు అయితే అటువంటి షాపులను శాఖాపరమైన చర్యలు తీసుకుని సీజ్ చేస్తామని హెచ్చరించారు. 25 నుంచి 35 రకాల కంపెనీలకు చెందిన విత్తనాలను పరిశీలించామన్నారు. రైతులు విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో విత్తనం ఏ కంపెనీకి చెందినది, రకం పేరు, లాట్ నెంబర్‌తోసహా కొనుగోలు రసీదుపై రాయించుకుని పంట దిగుబడి వచ్చే వరకు కూడా భద్ర పరుచుకోవాలని రైతులకు సూచించారు. ఈ దాడుల్లో ఎంఏవోలు గొట్టం లక్ష్మారెడ్డి, గొంటు కృష్ణారెడ్డి, సతీష్, వెంకటేష్ తదితరులున్నారు.

ప్లాస్టిక్ నిషేధంతో పర్యావరణానికి మేలు

ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రమణ


పర్యావరణ పరిరక్షణకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ, రెవెన్యూశాఖ అధికారులు

నకరికల్లు: ప్లాస్టిక్ నిషేధంతోనే పర్యావరణానికి మేలు జరుగుతుందని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ డి.రమణ అన్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యావరణ హిత జీవనశైలి కార్యక్రమం నకరికల్లులో శనివారం నిర్వహించారు. పర్యావరణాన్ని కాపాడతానని, ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధిస్తామని ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్లాస్టిక్ నిషేధంతోనే సాధ్యపడుతుందన్నారు. అటవీప్రాంతంలో చెట్లను నరకడం మాని మొక్కలను నాటి పరిరక్షించాలన్నారు. అటవీప్రాంతంలో చెట్లను కాపాడడం ద్వారా వాతావరణంలో సమతుల్యత ఏర్పడి సకాలంలో వర్షాలు పడతాయన్నారు. వన్యప్రాణుల రక్షణలో ప్రతిఒక్కరి భాగస్వామ్యం అవరసరని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.సురేష్, డిప్యూటి రేంజ్ ఆఫీసర్ నీలిమాదేవి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పురుషోత్తమరాజు, వీఆర్వో నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో 141 మందికి వైద్యసేవలు



సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం శనివారం సత్తెనపల్లి మండలం వెన్నాదేవి గ్రామంలో నిర్వహించారు. డాక్టర్ సాయి తేజ రెడ్డి వైద్య పరీక్షలను నిర్వహించారు. 141 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో జనరల్ ఓపి 46 మంది, హైపర్ టెన్షన్ 22 మంది, డయాబెటిస్ 25 మంది, హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిస్ 31 మంది, గర్భిణులు ఎనిమిది మంది, బాలింతలు ముగ్గురు, చిన్నారులు ఆరుగురు ఉన్నారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ నడవలేని వారి గృహాలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు వైద్య పరీక్షలు చేసి ఆరోగ్య బోధన చేపట్టారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ పెండెం మణిరావు, ఎమ్‌ఎల్‌హెచ్‌పీ డీ.తిరుమల వేణి, వెల్ఫేర్ అసిస్టెంట్ కె.కిరణ్ కుమార్, హెల్త్ అసిస్టెంట్ పి.నటరాజ్ తదితరులు ఉన్నారు.